క్లుప్తంగా

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు

పిడుగురాళ్ల: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ ఏఎంవీఐ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్‌లో శనివారం వాహనాల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రయాణాలు కొనసాగించడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. చిన్న ట్రాలీ ఆటోలో, ట్రాక్టర్లలో, టిప్పర్లలో కూడా లోడు సామర్థ్యానికి మించి అధికలోడు వేసుకొని ప్రయాణాలు కొనసాగిస్తున్నారని, వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా పరిమితికి మించి ప్రయాణికులను, సరుకు రవాణా తరలిస్తున్న 10 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.25,500 అపరాధ రుసుం విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

తుమ్మకోటలో మహిళ ఆత్మహత్య

రెంటచింతల: మండలంలోని తుమ్మకోటలో ఓ మహిళ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన సభావత్ సక్కా(45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో పాటు వారం రోజులుగా విష జ్వరంతో ఇబ్బంది పడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. భర్త రాజునాయక్ 20 ఏళ్ల కిందట ఈమెను వదిలి దూరంగా ఉండగా ఆమె గ్రామంలో తన తల్లివద్ద ఉంటూ ఓ హోటల్‌లో పని చేసుకుంటూ జీవిస్తుంద న్నారు. ఆమె కుమారుడు బ్రహ్మంనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి



గురజాల: అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాలు.. నగరపంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో లాంఫాంలో శుక్రవారం సాయంత్రం వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు సీఐ తెలిపారు. వివరాలు ఏమి తెలియలేదని వివరాలు తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు.

మున్సిపాలిటీ మేనేజర్‌గా చాంద్‌బాషా

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘ మేనేజర్ షేక్‌చాంద్ బాషా, ఆర్వోగా పూర్ణచంద్రరావు, ఏఈగా విష్ణువర్ధన్, ఆర్ఐగా ఆఫీస్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వీరంతా ఇక్కడకు వచ్చారు. మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబును కలిశారు.

మినీ వాటర్ ట్యాంక్‌లు శుభ్రం

మాచర్ల: పట్టణంలోని 13వ వార్డులో పలు ప్రాంతాల్లో ప్రజల అవసరాల కోసం మినీ వాటర్ ట్యాంకర్‌ను మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు. మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. పలు వార్డుల్లో మిని వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించి ప్రజలకు మంచినీటి సరఫరాలకు చర్యలు చేపట్టారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా సత్యనారాయణ



గురజాల రూరల్: మండల విద్యాశాఖాధికారిగా ఆకుల సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం గురజాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఎంఈఓ– 1గా జ్యోతి..



మాచర్ల రూరల్: మండల విద్యా శాఖాధికారి– 1 ఇన్‌చార్జిగా డి.జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. విజయపురిసౌత్ గవర్నమెంట్ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎంఈఓ జబ్రుల్లాఖాన్ అనారోగ్యంతో సెలవు పెట్టడంతో జ్యోతికి బాధ్యతలు అప్పగించారు.

చినగార్లపాడు వాసికి డైమండ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు

కారెంపూడి: మండలంలోని చినగార్లపాడు గ్రామానికి చెందిన అన్నపరెడ్డి పవన్ కుమార్ రెడ్డికి ప్రతిష్టాత్మక డైమండ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డు రావడంపై గ్రామ పెద్దలు,గ్రామస్తులు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం లండన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆయన చదువుకుంటూనే చేసిన సేవా కార్యక్రమాలు పదేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలను స్వదేశంలో చురుగ్గా నిర్వహించడాన్ని గుర్తించిన ఢిల్లీ పబ్లిక్ ఆర్గనైజేషన్ అవార్డును శుక్రవారం అందజేసింది. మారుమూల ఉన్న తమ గ్రామానికి చెందిన వ్యక్తికి అవార్డు రావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రెంటచింతలలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



గురజాలలో శిథిలావస్థకు చేసిన గురజాలలోని ఎస్సీ బాలికల హాస్టల్

సంక్షేమం ఆపసోపాలు..

● ప్రభుత్వ హాస్టల్లో వసతులు కరువు ● ఆహార నాణ్యత అధ్వానం

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

గురజాల: భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు వచ్చిన బాలలు. అమ్మానాన్నలకు దూరంగా ఉంటున్న నిరుపేదలు. వసతిగృహాలే వారికి ఆదరువు. అయితే కనీస వసతులు లేమి.. ఇరుకు గదులు.. అపరిశుభ్రత... నాణ్యతలేని ఆహారం.. దోమల బెడద.. మరుగుదొడ్ల నీటి వసతి లేమితో అవస్థలు పడుతున్నారు. ఇదీ ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితి..

చన్నీళ్ల స్నానం.... దోమలతో సహవాసం

గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల మండలంలో 11 ప్రభుత్వ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో ఎస్సీ హాస్టళ్లు 3, ఎస్టీ హాస్టళ్లు 2, బీసీ హాస్టళ్లు 6 ఉన్నాయి. వాటిల్లో పరిశుభ్రత నామమాత్రంగా మారింది. ఈ హాస్టళ్లలో చన్నీటి స్నానంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గదుల పక్కనే తిని పడేసిన వ్యర్థాలు ఉండటంతో ఆ ప్రాంతంలో దోమలు ఉధృతి పెరిగింది.

దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లు..

మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పటం లేదు. బాత్‌రూమ్‌లోకి వెళితే నీరుపోసేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆరు బయట స్నానాలు చేస్తున్నారు. చలికాలం కావడంతో తేళ్లు, కాలిజెర్రులు హాస్టల్ గదుల్లోకి వస్తున్నాయని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పిడుగురాళ్లలోని గురుకుల వసతి గృహం పక్కనే శ్మశానం ఉండటంతో రాత్రివేళ విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. మరుగుదొడ్లలో విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు అంటున్నారు. గురజాలలోని ఎస్సీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. వసతిగృహం ఏర్పాటుకు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఆయా శాఖాధికారులు తెలిపారు.



రెంటచింతలలో అద్దె భవనంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం

అద్దె భవనాలే దిక్కు..

రెంటచింతల: మండలంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. సొంత భవనాలు లేవు. అద్దె భవనాలే దిక్కు అయ్యాయి. 2000 సంవత్సరం వరకు యనమదల గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర సంక్షేమ గృహం మూసివేయడంతో రెంటచింతలలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కూడా మౌలిక వసతులు లేని అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రస్తుతం 95 మంది విద్యార్థులున్నారు. విరిగిపోయిన తలుపులతో అధ్వానమైన మరుగుదొడ్లతో పాటు కనీస వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేగులమాన్యం సమీపంలో బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామంలోని వివిధ పాఠశాలలకు ఈ వసతి గృహం దూరంగా ఉండటంతో ప్రస్తుతం 50 మంది విద్యార్థులు ఉన్నారు. సుమారు 1980 నుంచి గ్రామంలో వివిధ ప్రాంతాలలోని అద్దె భవనాలలో బీసీ బాలుర సంక్షేమ గృహం ఉంటుంది. మాచర్ల, రెంటచింతల, గురజాల, దుర్గి, వెల్దుర్తి మండలాలోని పలు గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు ఈ సంక్షేమ వసతి గృహాలలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు.

హామీలు అమలులో బాబు విఫలం



మల్లవరంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి

మల్లవరం(రెంటచింతల): సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం, అమలులో విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామంలో పార్టీ నాయకులతో కలసి బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనిఇంటింటికి వెళ్లి బాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వంచక పాలనను వివరిస్తూ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన మంత్రివర్గం అమలు చేస్తున్న రెడ్‌బుక్ పాలనపై ప్రజలలో చైతన్యం తీసుకొస్తున్నట్లు చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను అమలు చేయకుండా మోసం చేశారని ఇది ఆయన నైజమని ఆరోపించారు. మాచర్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పాముల సంపూర్ణమ్మ మాట్లాడుతూ ప్రజలు సంక్షేమానికి దూరమైనట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన దోచుకో.. దాచుకో అన్నట్లు పాలన ఉందని పేర్కొన్నారు. తీరును ప్రజలకు వివరించడానికే బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పార్టీ అధిష్ఠానం తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి వడితే సోనమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకులు నవులూరి చెన్నారెడ్డి, మాజీ సర్పంచి షేక్ సుభాని, పార్టీ నాయకులు వి.బుడ్డసైదా, షేక్ బుగ్గల సైదా, బి.కోటేశ్వరరావు, మంత్రూనాయక్, ఎస్.లక్ష్మీనారాయణ, దొడ్డా గోపి, ఆర్.గంగూనాయక్, సిద్దల మరియదాసు పాల్గొన్నారు.

కవితల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలి



కరిముల్లాను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె

మాచర్ల రూరల్: కవులు తమ కవిత్వంతో ప్రజలను చైతన్యం చేయటంతో పాటు వారి బాధలు, గాధలను ప్రజలకు అర్ధమయ్యేలా వివరించగలిగిన వారే నిజమైన కవులని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. శనివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ప్రముఖ కవి కరిముల్లాను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రజా సమస్యలను గుర్తించి తమదైన శైలిలో కవితలు రచించి ప్రజలను చైతన్యవంతం చేయటంలో కరిముల్లా కృషి ప్రశంసనీయమని చెప్పారు. రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు మాట్లాడుతూ కరిముల్లా తన కవితలతో అనుసరించిన శైలి ప్రముఖ గజల్ కవులను తలపింపజేస్తుందని, పాఠకులను ఆలోచింపజేసేదిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కవి కరిముల్లా తను రచించిన ఎదురుమతం కవిత సంకల్పాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రచయిత జగన్నాధాచార్యులు, పాషావలి, డాక్టర్ దాక్షాయని, నాగూర్‌వలి, ఆదినారాయణ, గాలీబు, లక్ష్మణరావు, జార్జి, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు తదితరులున్నారు.

పీ4పై ప్రజలకు అవగాహన

మాచర్ల: పట్టణంలో ప్రజలు పీ 4పై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు సూచించారు. శనివారం నిర్వహించి పీ 4 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీ4 పేదల అభివృద్ధికి నిర్వహిస్తున్న కార్యక్రమం అన్నారు.

కార్గిల్ వీరులను స్మరించుకోవడం మన బాధ్యత

రెంటచింతల: కార్గిల్ యుద్ధం అసువులు బాసిన వీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఏఎస్‌ఎం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.నాగేశ్వరరావు నాయక్ పేర్కొన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివాస్ స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత సైన్యం 1999 మే 3 నుంచి జూలై 26 వరకు కార్గిల్ యుద్ధంలో 537 మంది భారత సైన్యం అమరులయ్యారని గుర్తు చేశారు. భారత సైన్యం సంపూర్ణమైన విజయం సాధించి దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటినట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి గుర్తుగా ప్రతి ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివాస్ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. అనంతరం పాఠశాలలో అమరు వీరుల చిత్రానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ, హెచ్‌ఎం సీహెచ్ నాసరయ్య, ఉపాధ్యాయులు జిగురు చంద్ర శేఖర్‌శర్మ, ఆదూరి మేరి జోసినా, మండవ పుల్లారావు, సోమ్లా నాయక్ పాల్గొన్నారు.



జెడ్పీ హైస్కూల్‌లో కార్గిల్ వీరులకు నివాళి

కౌలు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలి

పిడుగురాళ్ల: పంట పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేసే కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులను తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.సంధ్యారాణి శనివారం తెలిపారు. కార్డు వలన రైతులకు కలిగే ఉపయోగాలు వివరించారు. పంట నమోదు, రాయితీపై విత్తనాలు, పంట నష్ట పరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, ప్రభుత్వం ద్వారా పంట మద్దతు ధరకు విక్రయించుకునే అవకాశంతోపాటు పంట పైన సున్నా వడ్డీ రుణాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పథకాలు వర్తించాలంటే కౌలు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల సభ్యులు

మాచర్ల: పట్టణంలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారపు కిట్లను శనివారం అందజేశారు. మండాది రోడ్డులో చెంచు కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో సుమారుగా 30 మందికి పంపిణీ చేశారు. డాక్టర్ రామకోటయ్య, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. డాక్టర్ దశరథ్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షుడు తుమ్మల సత్య ప్రసాద్, కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు, కోశాధికారి యనమదల వెంకటరామయ్య, రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ రామకోటయ్య, పఠాన్ నాగూర్ వలి, చెరుకూరి నరసింహారావు, పోలూరి శ్రీనివాసరావు, సిద్ధం రాజు, నాగార్జున రెడ్డి, మెట్టు గోవింద రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలి

నిరసన వ్యక్తంచేసిన యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు



విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట: ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలని, రెండు నెలలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న క్యాడర్ స్ట్రెంత్ సమస్య వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు మాట్లాడుతూ యోగాంధ్ర, మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు, శిక్షణ తరగతుల పేరుతో అనేక కార్యక్రమాలు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నాయన్నారు. బదిలీలు జరిగినా వేలాది ఉపాధ్యాయులు రిలీవ్‌కు నోచుకోలేదని అన్నారు. వేలాది స్కూళ్లు సింగిల్ టీచర్లతోనే పని చేస్తున్నాయన్నారు. పేరుకు ఐదుగురు టీచర్లను ఇచ్చినా కేవలం ఇద్దరితోనే పనిచేస్తున్నాయన్నారు. సెలవులు ఉపయోగించుకోకుండా ఆంక్షలు పెట్టారన్నారు. సుమారు 25 వేల మంది ఉపాధ్యాయులు రెండు నెలలుగా జీతాలు లేకుండా చేయడంపై వారు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. తమ ఆందోళనను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. లేనిపక్షంలో మరింతగా తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత



అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయుడు ముదునూరు అక్షయకుమార్ దత్తు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరతగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ఐదుగురు విద్యార్థులకు రూ. 5వేల చొప్పున నగదు పురస్కారం అందచేశారు. అక్షయకుమార్ దత్తు భార్య లలిత చేతుల మీదుగా రమ్య, షేక్ పర్వీన్, ఉయ్యాల ఉష, షేక్ అర్షియా కౌసర్, కంభంపాటి కీర్తనలకు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, జిల్లా క్రికెట్ కమిటీలో అండర్ -14,16,19 సెలక్టర్ డి.భీమారావును పాఠశాల కార్యవర్గం, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు వలివేటి శేఖర్, మాజీ ప్రధానోపాధ్యాయులు కొల్లి లక్ష్మీనారాయణ, సాయిబాబు, దత్తు మాస్టారి కుటుంబ సభ్యులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్ చిత్తు

సీఐ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీఐ

అచ్చంపేట: విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని, చదువులపై దృష్టి సారించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని అచ్చంపేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. మత్తు పదార్థాల వల్ల అనర్థాలపై శనివారం ఆయన స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, గుట్కా, సిగిరెట్లు మద్యపానానికి అలవాటు పడడం వల్ల వచ్చే ప్రమాదాల గురించి వివరించారు. ఎక్కడైనా డ్రగ్స్ వ్యాపారం చేసే వారిని గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

నాలుగు రోడ్ల కూడలిలో ...

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆన్‌లైన్, బ్యాంకు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా వేధింపుల గురించి వివరించారు. అనుమానాస్పద లింకులు, కాల్స్, సందేశాలు అందుకున్నప్పుడు స్పందించవద్దని తెలిపారు. ఈ సమయంలో సైబర్ హెల్ప్‌లైన్ 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడపడం చట్టపరంగా నేరమని తల్లిదండ్రులకు తెలియజేశారు. మైనర్ల వాహన డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం పోరాడే ప్రతి పౌరుడు సైనికుడే !

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సీఐ విజయ్ కుమార్



రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు సన్మానం

సత్తెనపల్లి: దేశం కోసం పోరాడే ప్రతి పౌరుడు సైనికుడేనని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మేరా యువ భారత్ గుంటూరు (మై భారత్) సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్గిల్ విజయ్ దివాస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లా డారు. భారత సైనిక చరిత్రలో అత్యంత ముఖ్యమైన విజయాలలో ఒకదానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివాస్‌ను జరుపుకుంటున్నామని తెలిపారు. కార్గిల్ యుద్ధంలో 500 మందికి పైగా భారతీయ సైనికులు దేశం కోసం త్యాగం చేశారని వివరించారు. అనంతరం రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది విజయ్ కుమార్, షేక్ మొహమ్మద్ ఆయుబ్, ఎం. పుల్లయ్యను ఘనంగా సన్మానించారు. ముందుగా దేశం కోసం ప్రాణాలర్పించిన యువ తేజం మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్గిల్ విజయ్ దివాస్‌పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ఆరుగురు విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీతో పాటు మొక్క లు నాటారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్య వస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, టీచర్ మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం. రమే ష్, శ్రావణి, మీరాభి, విద్యార్థులు, పాల్గొన్నారు.

కంకణాలపల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

సత్తెనపల్లి: మండలంలోని కంకణాలపల్లిలో శనివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందిస్తామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమవుతుందని వెల్లడించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇప్పటికే తల్లికి వందనం పథకం అమలు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీల్లో 80 శాతం పూర్తి చేశామని చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణతో పాటు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

క్రోసూరు: దోమల ద్వారా, నీటి కలుషితం ద్వారా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ సూచించారు. క్రోసూరులోని ఎస్టీ, బీసీ కాలనీల్లో శనివారం డెంగీ, అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్యాంసన్ మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టడానికి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిలవ లేకుండా చూడాలని తెలిపారు. వారానికి ఒక్కసారి కిరోసిన్ గానీ మడ్డి ఆయిల్‌ను గానీ చల్లితే దోమల పుట్టుకను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రేమ రాజ్, ప్రహ్లాద్, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

చిలకలూరిపేట: ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతీ వరప్రసాద్ చెప్పారు. వినుకొండలో ఆగస్టు 7,8 తేదీలలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ది కోసం కులమతాల మధ్య ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం చిచ్చు పెడుతోందని విమర్శించారు. మరోవైపు అలవి కాని హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను అన్ని రకాల మోసగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో వినుకొండలో నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, నాయకులు బొంతా ధనరాజ్, దాసరి వరహాలు, వేలూరు గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, షేక్ నన్నే తదితరులు పాల్గొన్నారు.